AP 4PG 28 - 2- 2026SATURDAY qxp_Layout 1 28-02-2026 05:21 AM Page 2



## శేష వాహనంపై శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి



యాడికి, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ )
యాడికిలో శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు శేష వాహనంపై అలంకరించబడి భక్తులకు దర్శనం ఇచ్చారు. వేకువజాముననే ఆలయ ప్రధాన అర్చకులు హరి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తుల సమక్షంలో వేదమంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సాయంత్రం శేష వాహనంపై స్వామివారిని సుందరంగా అలంకరించి గ్రామంలోని పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. మహిళలు, యువత,వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు

## అనంతపురం త్రీటౌన్ కానిస్టేబుల్ మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



అనంతపురం, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
అనంతపురం త్రీటౌన్ కానిస్టేబుల్ నసీరుద్దీన్ మృతదేహానికి ఈరోజు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇతను 2009 సంవత్సరంలో కానిస్టేబుల్ గా చేరారు. ప్రస్తుతం స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ గా పని చేస్తున్నాడు. ఇతనికి హఠాత్తుగా గుండె నొప్పి వచ్చింది. గమనించి ఆసుపత్రికి తరలించే లోపు చనిపోయాడు. స్థానిక రాజీవ్ కాలనీకి చెందిన నసీరుద్దీన్ మృతదేహానికి ఈరోజు ప్రభుత్వ లాంఛనాలతో స్థానిక హెచ్చెల్సీ కాలనీ సమీపంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు ముగించారు. మృతుడికి భార్య సల్మా, కొడుకు , కూతురు ఉన్నారు. జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ గారి ఆదేశాల మేరకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, త్రీటౌన్ సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ , ఆర్ ఐ లు పవన్ కుమార్, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , గాండ్ల హరినాథ్, మరియు బ్యాచిమేట్స్, మృతుని బంధువులు, తదితరులు పాల్గొన్నారు

## నాలుగేళ్లుగా సిబ్బంది కొరత..!



అనంతపురం, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లాలో కల్తీ ఆహారం వ్యవహారం ప్రజల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది. హోటల్లు, దాబాల్లో నాసిరకం , హానికర రంగులు వాడటం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. జిల్లాలో కేవలం ఒకే ఆహార భద్రతా అధికారి ఉండటం గమనార్హం. సిబ్బంది కొరతతో అనంతపురం జిల్లా అక్రమాలకు నిలయంగా మారింది. దీంతో ఖాళీలను భర్తీచేసి తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కలగళ్లలో శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయ గోపురం కలశ స్థాపన



కూడేరు, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)కూడేరు మండల పరిధిలోని కలగళ్ల గ్రామంలో కాశీ విశ్వనాథ స్వామి ఆలయ గోపురం కలశ శంకుస్థాపన వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కాశీ విశ్వనాథ స్వామి ఆలయం పూర్వం చిన్నపాటి ధూప దీపాలతో శ్రీకాశీ విశ్వనాథ స్వామి గా భక్తుల చేత పూజలు అందుకుంటూ కాలక్రమేనా ప్రజల కోరికలు తీర్చే కొంగ బంగారం గా వెలిశారు. నిత్య పూజలు అందుకుంటూ శివ స్వాముల సంకల్పంతో నేడు ఆధ్యాత్మిక దైవ కేంద్రంగా నిలిచింది. ఈ కలశ స్థాపనలో ఓం నమశ్శివాయ అంటూ గురవయ్యలతో పాలు తాగించడం చేయించారు. కలశ స్థాపనకు వచ్చినటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సన్నిధిలో పెద్ద ఎత్తున అన్న ప్రసాద కార్యక్రమం కూడా చేపట్టారు. అనంతరం స్థానిక భక్తులు మరియు మండల వ్యాప్తంగా స్వామి వారి దర్శన నిమిత్తం తరలి వచ్చిన భక్తులు ఆలయ సన్నిధికి చేరుకొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.






## బ్రహ్మోత్సవాల్లో ఇరుసు పోటీల సందడి



యాడికి, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని శ్రీ శివలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జేసీ ఫ్యామిలీ మరియు భక్తాదుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇరుసు పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్వహించిన ఈ పోటీలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఆనందించారు.
పోటీల్లో కల్లూరు గ్రామానికి చెందిన కొండకింద రాజు ప్రతిభ చాటుతూ మొదటి బహుమతిగా రూ.10,000 నగదు బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ బహుమతిని పెద్దపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తోరెడ్డి రాజారెడ్డి తరపున గొర్తి రుద్రమ నాయుడు అందజేశారు. అలాగే రాజారెడ్డి మిత్రుడు గుండా నారాయణస్వామిని కమిటీ సభ్యులు శాలువా, మెమెంటోలతో సత్కరించారు. రెండవ బహుమతిగా రూ.6,000ను నాగిరెడ్డిపల్లి గ్రామ నివాసి రామానంద అందుకున్నారు. ఈ బహుమతిని వంకం నాగమయ్య కుమారుడు రాజు అందజేయగా, వారిని కూడా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మూడవ బహుమతిగా రూ.4,000ను ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నారాయణ కైవసం చేసుకున్నారు. ఈ బహుమతిని కూన వెంకటస్వామి అందజేశారు. బహుమతులు అందించిన దాతలను కమిటీ సభ్యులు శాలువాలు, మెమెంటోలతో అభినందించారు. గ్రామీణ సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తూ జేసీ ఫ్యామిలీ చేస్తున్న సేవలను ప్రజలు ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా, గ్రామీణ సంస్కృతిని కాపాడుతున్నాయని అభిప్రాయపడ్డారు

## వేములపాడు గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం



యాడికి ,ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు శుక్రవారం యాడికి మండలం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేములపాడు గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు నేతృత్వంలో వేములపాడు సచివాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే పాటించాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి తొట్లను శుభ్రంగా కడిగి, కనీసం ఒక గంటపాటు ఆరబెట్టిన తరువాతే మళ్లీ నీరు నింపుకోవాలని సూచించారు. అలాగే తాగి పడేసిన టెంకాయ బొండాలు, టీ కప్పులు, పూల కుండీలు, పాత టైర్లు, ఇంటి ఆవరణలోని ఇతర వస్తువులు మరియు రిఫ్రిజిరేటర్ వెనుక భాగంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ సాయిలతకు రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే మలేరియా నిర్ధారణకు సంబంధించిన క్రాస్ చెక్ స్లైడ్‌లను తప్పనిసరిగా మలేరియా కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ సాయిలత, ఆశా వర్కర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి సభ్యత్వమే పునాది



యాడికి, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ )
జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమైన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తాడిపత్రి అసెంబ్లీ ఇంచార్జ్ కదిరి శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యాడికి మండల జనసేన పార్టీ కార్యాలయంలో శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం జనసేన పార్టీ భవిష్యత్తుకు పునాది వంటిదని తెలిపారు. ప్రతి నాయకుడు, కార్యకర్త అత్యంత బాధ్యతతో సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లో మరింత బలంగా తీసుకెళ్లాలంటే సభ్యత్వ నమోదు కీలకమని పేర్కొన్నారు. ప్రతి బూత్, ప్రతి వార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు జరగాలన్నదే పార్టీ లక్ష్యమని చెప్పారు. యువత, మహిళలు, కార్మికులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి క్రియాశీలక సభ్యుడు పార్టీకి బలమైన శక్తిగా నిలుస్తాడని, వారికి పార్టీ పరంగా పూర్తి భరోసా ఉంటుందని వెల్లడించారు. యాడికి జనసేన మండల కన్వీనర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడమే ఉద్యమి సభ్యత్వ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఐక్యతతో, సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు జాకీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శులు మధు ఆచారి, పప్పు వెంకటేష్, గుండ్ల శివ నాగభూషణం, సోమ రాజేష్, దస్తగిరి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అబ్దుల్ రహీమాన్, అల్లా ఓబయ్య తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## పుట్టకలమర్రిలో బొలెరో బోల్తా
## గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించాలని ఆది కృష్ణమ్మ ఆదేశం



ఆదోని, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
కర్నూలు జిల్లాలోని ఆస్పరి మండలం పుట్టకలమర్రి గ్రామంలో బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనపై గుడిసె ఆది కృష్ణమ్మ స్పందించారు. వివిధ సమావేశాల నిమిత్తం విజయవాడలో ఉన్న ఆమె, ఘటన విషయం తెలుసుకున్న వెంటనే ఫోన్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడి గాయపడిన వారికి తక్షణ వైద్యసహాయం అందించాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరఫున అవసరమైన ఆర్థిక సాయం కూడా అందించాలని సూచించారు.
అలాగే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రహదారి భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆమె సూచించారు. ప్రమాదాలకు కారణమయ్యే రహదారి లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులను కోరారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఘటనకు గల కారణాలపై పూర్తి వివరాలు వెలికితీసే పనిలో ఉన్నారు

## అమరావతి నగర్‌లో మరో సీసీ రోడ్డు ప్రారంభం --- కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ



ఆదోని, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
ఆదోని మున్సిపాలిటీ 35వ వార్డు పరిధిలోని అమరావతి నగర్ కాలనీలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న కొత్త సీసీ రోడ్డుకు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ శంకుస్థాపన చేశారు. వార్డు అభివృద్ధి కోసం చేపడుతున్న పనుల్లో భాగంగా ఈ రహదారి నిర్మాణం చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. పార్థసారథి పై విశ్వాసంతో పార్టీ మారినప్పుడు అనేక విమర్శలు ఎదురైనా వెనుకడుగు వేయలేదని, పట్టుదలతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రూ.32 లక్షలతో మూడు రహదారుల నిర్మాణం పూర్తి చేశామని, రూ.52 లక్షలతో డ్రైనేజ్ పనులు ప్రారంభించి కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం మరియు ఎమ్మెల్యే మార్గదర్శకంతోనే ఈ అభివృద్ధి సాధ్యమైందని ఆమె అన్నారు.
మాకు ఓటు వేసి గెలిపించిన ప్రజల ఋణం ఎప్పటికీ తీర్చలేమని, త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామని లలితమ్మ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు వెల్లాల మధుసూధన శర్మ, పరుశురాం, బాషా, అశోక్ తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉరవకొండ సర్పంచ్ లలితమ్మను, వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా ను సన్మానించిన దేవాదాయ శాఖ



ఉరవకొండ, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
ఉరవకొండ లో ప్రసిద్ధి చెందిన శ్రీ గవిమఠసంస్థానం శ్రీ శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్థానిక సర్పంచ్ లలితమ్మ, వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా భక్తిశ్రద్ధలతో స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని శ్రీ చంద్రమౌళి స్వామి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు ఉరవకొండ స్థానిక సర్పంచ్ లలితమ్మను, వజ్రకరూరు మేజర్ సర్పంచ్ మోనాలిసా కు శాలవాల పప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల వెంట స్థానిక ఆయా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించిన డిడబ్ల్యుఎంఏ పిడి సలీం భాష



కూడేరు, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
కూడేరు మండల కేంద్రంలోని శుక్రవారం రోజున ఎంపీడీవో కార్యాలయం నందు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి సలీం భాష ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. సమీక్షలో భాగంగా ఇన్ ప్రోగ్రెస్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా కొత్తగా శాంక్షన్ వచ్చిన పిఆర్ మరియు ఆర్డబ్ల్యూఎస్ పనులను క్షేత్రస్థాయిలో త్వరితగతిన పూర్తి చేసి బిల్స్ మొత్తం అప్లోడ్ చేయాలని, అదేవిధంగా కూలీల సంఖ్య పెంచాలని, రాబోవు 25 రోజులలో మొత్తం 50000 పని దినాలను కల్పించాలని ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పోలేరయ్య ఆర్డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య , ఈసీ రాజేష్ కుమార్ , సాంకేతిక సహాయకులు, బి.ఎఫ్.టి మరియు కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు

## మాజీ సీఎం వైయస్ జగన్ ను కలిసిన ప్రసన్నకుమార్



కూడేరు, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని కొర్రకోడు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త ప్రసన్నకుమార్ విజయవాడ తాడేపల్లి వైసిపి కేంద్ర పార్టీ కార్యాలయంలో గురువారం రోజున రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిని మరియు నారా లోకేష్ గారిని కలిసిన జెసి ప్రభాకర్ రెడ్డి



అనంతపురం, ఫిబ్రవరి 27 (అనంత ప్రభ)
తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ శ్రీ జెసి ప్రభాకర్ రెడ్డి గారు నేడు అమరావతి లోని సచివాలయం నందు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిని మరియు గౌరవ ఐటీ శాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారిని కలిసి తాడిపత్రి మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా తాడిపత్రి మున్సిపాలిటీలో ఇటీవల ప్రారంభించిన సోలార్ ప్లాంట్ వలన దాదాపు 22 లక్షల రూపాయల విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది అని తెలిపారు , అంతేకాకుండా హిందూ స్మశానవాటికలో చేస్తున్న అభివృద్ధి పనులు మరియు నూతనంగా ఏర్పాటు చేయనున్న షాపింగ్ కాంప్లెక్స్ గురించి విశదీకరించి చెప్పడం జరిగింది. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఒక నమూనాను కూడా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి మరియు ×ు శాఖ మంత్రి నారా లోకేష్ గారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు "నీ మునిసిపాలిటీ భేష్ ప్రభాకర్" అంటూ జెసి ప్రభాకర్ రెడ్డి గారిని అభినందించారు.

అదే విధంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారిని కలిసి పప్పూరు శ్రీ ఆశ్వర్థ నారాయణ స్వామి ఆలయ అభివృద్ధి కోసం 2 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని విన్నపించగా త్వరలో మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.